మెయిన్

# టీ-మీడియా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక : 320
పేజీలు : 3

మంగళవారం-23 జూన్, 2026

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

T మీడియా పెళ్లి పందిరి

బ్రాహ్మణ వధువుల వివరాలు కావాల్సినవారు

సంప్రదించండి:

8919710365
7382990365
8500459365

## యాప్‌లో కనిపిస్తేనే యూరియా

- పట్టాలేని రైతుల బాధలు
- పట్టాలేని రైతులకు ప్రత్యామ్నాయం చూపాలని డిమాండ్

**టీ మీడియా, జూన్ 22, హైదరాబాద్ బ్యూరో :**

యూరియాను పరిమితికి మించి వినియోగిస్తున్నారని, మరికొన్నిచోట్ల నిల్వలు పక్కదారి పట్టిస్తున్నారనే నెపంతో ప్రభుత్వం గత సంవత్సరం నుంచి 'ఫెర్టిలైజర్ యాప్' వినియోగంలోకి తీసుకొచ్చింది. దీనికోసం ప్రభుత్వం నిపుణుల సూచనలు తీసుకుంది. వారి సూచనలను అనుసరించి ఎకరాకు సీజన్‌కు రెండు బస్తాల చొప్పున బుకింగ్ చేసుకునే అవకాశాన్ని కల్పించింది. కానీ, భూమి వివరాల నమోదు సమస్యలు, ఫోన్‌పై అవగాహన లేమి, సాంకేతికత ఇబ్బందుల కారణంగా 'యాప్' ద్వారా సకాలంలో యూరియా అందటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ కారణంగా నిజామాబాద్? జిల్లా వ్యాప్తంగా నిత్యం ఎక్కడో ఒక ప్రాంతంలో అయినా రైతులు ఆందోళనలకు దిగుతున్నారు. పైగా పంట విరామ కాలంలో ప్రభుత్వం బుకింగ్ నిలిపివేస్తోంది. దీంతో ఆ సమయంలో ఆరుతడులు వేసే ఉద్యాన రైతులు, పశుగ్రాసం, కూరగాయలు పండించుకునే వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే యూరియాను దశల వారీగా అందించడంతో రైతులకు బస్తాలను తరలించేందుకు రవాణా ఖర్చు భారమౌతోంది.

**పట్టా మంజూరు కాకపోవడంతో** నిజామాబాద్? జిల్లా ధర్పల్లి మండలం వాడి



గ్రామానికి చెందిన నర్సయ్య, చిన్నసాయిలుకు ముత్తాల కాలం నుంచి వారసత్వంగా ఏడు ఎకరాల భూమి సంక్రమించింది. అయితే వారికి ఐదు ఎకరాల భూమికి మాత్రమే పట్టా ఉంది. దీంతో ఈ భూముల విషయంలో తండ్రి లింబయ్య సర్వే చేయించారు. అయినా వారికి పట్టా మంజూరు కాలేదు. పైగా ఆయన వారసులు పుట్టు మూగవారు. దీంతో అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేసినా ఫలితం లేకపోయింది. మిగతా భూమికి సంబంధించిన పట్టా రాలేదు. అయితే వరి సాగు చేసేందుకు వీరికి వానాకాలంలో 21 బస్తాల యూరియా అవసం ఉంటుంది. అయితే, ప్రభుత్వ యాప్? ప్రకారం వీరికి కేవలం పది బస్తాలే తీసుకునే అవకాశం ఉంది.

మిగతా 3లో..

## తెలంగాణకు రక్షణ రంగం బూస్ట్..

### కేంద్ర మంత్రితో సీఎం రేవంత్ రెడ్డి కీలకభేటీ!

**టి మీడియా, జూన్ 22, హైదరాబాద్ బ్యూరో :**



న్యూఢిల్లీ పర్యటనలో భాగంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో కీలక సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులపై ఇరువురు నేతలు విస్తృతంగా చర్చించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం రక్షణ శాఖకు చెందిన భూములను రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించినందుకు సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని ఈ సందర్భంగా ఆయన అభినందించారు.

అలాగే రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్ అభివృద్ధి అంశాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రస్తావించారు. భూ సేకరణ, యుటిలిటీల బదలాయింపు తదితర అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని కేంద్ర మంత్రికి హామీ ఇచ్చారు. దేశ భద్రత, రక్షణకు సంబంధించిన ప్రాజెక్టు కావడంతో రాష్ట్రం తరఫున అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలు అందజేస్తామని స్పష్టం చేశారు. భారత వైమానిక దళం విస్తరణ ప్రణాళికల్లో భాగంగా ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను భారీ స్థాయిలో అభివృద్ధి చేస్తున్న నేపథ్యంలో, ప్రయాణికుల కోసం సివిల్ ఏవియేషన్ టెర్మినల్, కార్గో సదుపాయాలు, మెయింటెనెన్స్, రిపేర్ అండ్ ఓవర్‌హాల్ కేంద్రాలు, హ్యాంగర్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. దీంతో పాటు అంతర్జాతీయ స్థాయి విమానయాన సంస్థలు తమ హ్యాంగర్లను ఏర్పాటు చేసుకునేలా ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల మధ్యప్రాచ్య ప్రాంతంలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచ ప్రఖ్యాత ఎయిర్‌లైన్స్‌కు ప్రత్యామ్నాయ కేంద్రంగా ఆదిలాబాద్ ఎదిగే అవకాశాలు ఉన్నాయని సీఎం అభిప్రాయపడ్డారు.

అలాగే మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర సమీపంలో డీఆర్‌డీవో, డీఆర్‌డీఎల్ ప్రతిపాదించిన కీలక రక్షణ ప్రాజెక్టుకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర రక్షణ మంత్రిని కోరారు. రాష్ట్ర అభివృద్ధి, జాతీయ భద్రతకు సంబంధించిన అంశాల్లో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ముందుకు సాగాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.

## రస్ లఫాన్లో భారీ పేలుడు

- ప్రపంచ ఇంధన మార్కెట్‌పై ప్రభావం

**టి మీడియా, జూన్ 22, ఢిల్లీ బ్యూరో:**

ప్రపంచంలోనే అతిపెద్ద ద్రవీకృత సహజ వాయువు ఎగుమతి దేశమైన ఖతార్‌లోని రస్ లఫాన్ ఇండస్ట్రియల్ సిటీలో ఘోర ప్రమాదం సంభవించింది. అక్కడి ప్రముఖ 'బర్జాన్ గ్యాస్ ప్లాంట్'లో ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించడంతో పారిశ్రామిక ప్రాంతం మొత్తం వణికిపోయింది. పేలుడు ధాటికి ప్లాంట్‌లో ఆకాశాన్ని తాకేలా పెద్దఎత్తున మంటలు, దట్టమైన పొగ చెలరేగాయి. ఈ భీకర దుర్ఘటనలో దాదాపు 54 మంది కార్మికులు తీవ్రంగా గాయపడగా, మరో 18 మంది ఆచూకీ లేకుండా గల్లంతయ్యారు. మంటల తీవ్రత మరియు ప్రమాద పీడనం చూస్తుంటే గల్లంతైన వారంతా అక్కడికక్కడే సజీవదహనమై, చనిపోయి ఉంటారని స్థానిక వర్గాలు భావిస్తున్నాయి. ఈ పేలుడు సంభవించడానికి గల ఖచ్చితమైన కారణాలు మరియు దీనివల్ల వాటిల్లిన ఆస్తి నష్ట తీవ్రతపై యాజమాన్యం, అక్కడి ప్రభుత్వం ఇంకా అధికారిక ప్రకటన విడుదల చేయాల్సి ఉంది.

**ప్రపంచ ఇంధన మార్కెట్‌పై ప్రభావం ..?**



రస్ లఫాన్‌లోని ఈ బర్జాన్ ప్లాంట్ అంతర్జాతీయ ఇంధన రంగానికి అత్యంత కీలకమైనది. ఇది రోజుకు దాదాపు 1.4 బిలియన్ స్టాండర్డ్ క్యూబిక్ ఫీట్ల గ్యాస్‌ను ఉత్పత్తి చేయగల అపారమైన సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఇంతటి భారీ ప్లాంట్‌లో ఘోర ప్రమాదం జరగడంతో గ్యాస్ ఉత్పత్తికి తీవ్ర ఆటంకం ఏర్పడింది. సమాచారం అందుకున్న వెంటనే ప్రత్యేక విపత్తు నిర్వహణ బృందాలు, అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగి మంటలను అదుపు చేయడానికి శ్రమిస్తున్నారు. అత్యంత కీలకమైన గ్యాస్ ప్లాంట్‌లో పేలుడు సంభవించడంతో ప్రపంచవ్యాప్తంగా ఎల్ఎన్‌జీ సరఫరా చైన్‌పై మరియు ఇంధన ధరలపై దీని ప్రభావం పడే అవకాశం ఉందనే ఆందోళనలు అంతర్జాతీయ మార్కెట్లలో వ్యక్తమవుతున్నాయి.

## మాఫియాకు అడ్డొస్తే లారీలో తొక్కిస్తారా..

- డీటీవో మరణంపై హరీశ్‌రావు అనుమానాలు

**టి మీడియా, జూన్ 22, భూపాలపల్లి :**



బొగ్గు టిప్పర్ లారీ ఢీకొని జయశంకర్ భూపాలపల్లి డీటీవో వెంకన్న మరణించడంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు అనుమానం వ్యక్తం చేశారు. వెంకన్న ప్రమాదం వెనుక దాగిన నిజాన్ని వెలికితీయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు. అధికారులను బెదిరిస్తూ అక్రమ దందాలు సాగిస్తున్న ఇసుక మాఫియా, బొగ్గు మాఫియాలకు అడ్డొస్తే లారీలతో తొక్కించి చంపిస్తారా అని మండిపడ్డారు. అధికారులను బెదిరిస్తూ అక్రమ దందాలు సాగిస్తున్న ఇసుక మాఫియా, బొగ్గు మాఫియా వివరాలను బయటపెట్టాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. డీటీవో వెంకన్న మరణం వెనుక ఉన్న వాస్తవాలను ప్రజల ముందుంచాలన్నారు. సమగ్ర విచారణ జరిపి దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి దారుణాలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

## కష్టాల్లో సాగునీటి కాలువలు

- నిర్వహణ నిర్లక్ష్యంతో ఆయకట్టుకు చేరని నీళ్లు

**టి మీడియా, జూన్ 22,హైదరాబాద్ బ్యూరో :**

సాధారణంగా ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో ఒడిసిపట్టిన నీరు ఆయకట్టుకు చేరితేనే కదా లక్ష్యం మేరకు పంటలు పండేది. కాలువలు, డిస్ట్రిబ్యూటరీలు వక్కలు చెక్కలై ముక్కలుగా పగిలిపోయి కట్టలు కోతకు గురై పూడికతో మైదానాలుగా మారితే ఆ నీళ్లు ఎలా పంట చేలకు చేరుతాయి? తెలంగాణ రాష్ట్రంలో ప్రధాన ప్రాజెక్టుల కింద ఉన్న కాలువల దుస్థితి చాలా తీవ్రంగా ఉంది. వానాకాలం రాకముందే మెయింటెనెన్స్ కింద వీటన్నింటి పునరుద్ధరణ పనులు చేపట్టాల్సి ఉంది. ప్రధానంగా ఓఅండ్?ఎం కోసం నీటిపారుదల శాఖలో ఒక డిపార్ట్?మెంటే ఉంది. ఏటా రూ.280 కోట్ల వరకు నిధులను కేటాయిస్తున్నారు. లక్ష్యం మేరకు ఈ నిధులు వినియోగించకపోవడంతో ఆయకట్టుకు సాగునీరు అందడం చాలా కష్టంగా మారుతోంది.

**ఇంజినీర్లకే అధికారాలు కల్పించినా**

అత్యవసర, నిర్వహణ పనులకు ప్రభుత్వ అనుమతితో సంబంధం లేకుండా నిధులు కేటాయించుకునేందుకు ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్?కు అధికారాలు కల్పించారు. 2020 డిసెంబరు 28న అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులతో డీఈఈ పరిధిలో రూ.5 లక్షల లోపు, ఈఈ పరిధిలో రూ.25 లక్షలు, ఎస్ఈ పరిధిలో రూ.రెండు కోట్ల లోపు, సీఈ, ఇంజినీరింగ్? ఇన్? చీఫ్ పరిధిలో రూ.5 కోట్ల లోపు పనులకు పరిపాలన అనుమతులు ఇచ్చే వెసులుబాటును కల్పించారు. ఈ నిధుల వినియోగం క్షేత్రస్థాయిలో ఏ మాత్రం కనిపించడం లేదు. రైతుల నుంచి ఒత్తిడి వచ్చినప్పుడో లేదంటే ప్రజాప్రతినిధులు గుర్తు చేసినప్పుడో మాత్రమే పనులు జరుగుతున్నాయనేది నిజం. శ్రీరాంసాగర్, నిజాంసాగర్, నాగార్జునసాగర్, కల్వకుర్తితోపాటు అనేక ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాల కింద ఉన్న కాలువలు పూడికతో, చెట్లు, పొదలతో నిండిపోయి నీటికి ఆటంకంగా ఉన్నాయి. కాలువల లైనింగ్ తీవ్రంగా ధ్వంసమైంది. నిజాంసాగర్ ప్రాజెక్టులో పూడిక చేరడంతో 28 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఏకంగా 17 టీఎంసీలకు పడిపోయింది. ప్రస్తుతం కేవలం 7 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. ఈ ప్రాజెక్టు కింద కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లోని 1,15,825 ఎకరాల పంటలు సాగవుతున్నాయి. నిజామాబాద్ సమీపంలో ఈ ప్రాజెక్టు కాలువలకు సిమెంటు లైనింగ్ లేదు. పలు చోట్ల తీవ్రంగా కోతకు గురయ్యాయి. ఈ కాలువలపై అలీసాగర్, ఆర్గుల రాజారాం గుత్ప, జాకోరా లిఫ్ట్ ఇరిగేషన్? పథకాలున్నాయి. నిజాంసాగర్ నుంచి అలీసాగర్ ఎత్తిపోతల వరకు 8.9



టీఎంసీలు, అలీసాగర్‌కు 4.60 టీఎంసీలు, గుత్పకు 3 టీఎంసీల నీరు అవసరం ఉంది. కానీ, ప్రాజెక్టు నుంచి వదిలే నీరు ఈ పథకాలకు, ఆయకట్టుకు చేరడం వర్తమానంలో చాలా కష్టంగా మారుతోంది. ఖమ్మం జిల్లాలో నాగార్జున సాగర్ ఎడమ కాలువలో చాలా చోట్ల పూడిక పేరుకుపోయింది. డిస్ట్రిబ్యూటరీల తూములు, అక్విడెక్టులు అక్కడక్కడ తీవ్ర స్థాయిలో ధ్వంసమయ్యాయి. ఉమ్మడి పాలమూరు జిల్లాకు కీలకమైన కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో చాలా చోట్ల ప్రధాన, బ్రాంచి, డిస్ట్రిబ్యూటరీ కాలువల్లో లైనింగ్, కోతకు గురికావడం లాంటి సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. వికారాబాద్ జిల్లాలోని కోట్‌పల్లివాగు పునరుద్ధరణకు గతేడాది నిధులు కేటాయించినా ఇప్పటికీ కనీసం కాలువల మరమ్మతులు, ఆధునీకికరణ పనులు పూర్తి కాలేదు.

**గోడల నుంచి నీరు లీకేజీ**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అప్పర్ మానేరు జలాశయం కుడి ప్రధాన కాలువకు నీటిని విడుదల చేసే తూము షటర్ మూడేళ్ల క్రితం పాడైపోయింది. గత ఏడాది మరమ్మతుల కోసం రూ.20 లక్షల నిధులను మంజూరు చేశారు. రిజర్వాయర్?లో నీళ్ల ఉండటంతో కాంట్రాక్టర్? పనిచేసేందుకు ముందుకు రాలేదు. ఈ కాల్వ పరిధిలో ముస్తాబాద్ మండల పరిధిలో 12,245 ఎకరాల ఆయకట్టు సాగవుతుంది. షటర్‌కు సైడ్ రబ్బర్లు, పెడస్ట్రియల్, ఇతర వస్తువులు పూర్తిగా చెడిపోయాయి. రిజర్వాయర్?లో ఒక టీఎంసీపైన నింపితే చాలు ఆనకట్ట గోడల నుంచి నీరు లీకేజీ అవుతోంది. మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం మున్నూరు సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలోని ప్యాకేజీ 29 ప్రధాన కాలువ ఇది. లైనింగ్ శిథిలమై నీళ్లు వదిలితే కట్ట కొట్టుకుపోయేలా బలహీనంగా ఉంది. మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం మున్నూరు సమీపంలో నేషనల్? హైవే పక్కన ఉన్న కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలోని ప్యాకేజీ 29 ప్రధాన కాలువ లైనింగ్ శిథిలమై నీళ్లు వదిలితే కట్ట కొట్టుకుపోయేలా బలహీనంగా తయారైంది. పొరపాటున ఒకవేళ కట్ట తెగితే కాలువతోపాటు పక్కనే ఉన్న వంతెనకు కూడా ప్రమాదం పొంచి ఉంది. దీనికి సమీపంలోని దుందుబి వాగు కింది నుంచి కాలువ నీరు వెళ్లేలా నిర్మించిన సైఫన్ తరహా నిర్మాణం రక్షణ గోడ కూడా ధ్వంసమైనా ఇప్పటి వరకు అధికారుల ఎలాంటి మరమ్మతు చేయలేదువికారాబాద్ జిల్లా కోట్‌పల్లి వాగు ప్రాజెక్టు కుడి కాలువ మరమ్మతు పనులు సాగుతున్నాయి.

**కాలువల రూపురేఖలు**

వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి వాగు ప్రాజెక్టు కుడి కాలువ మరమ్మతు పనులు ప్రస్తుతం సాగుతున్నాయి. నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలంలోని రామడుగు మధ్యతరహా ప్రాజెక్టు కింద కుడి, ఎడమ కాలువలు పూర్తిగా రూపురేఖలు కోల్పోయాయి. 6,104 ఎకరాల ఆయకట్టుకు సాగునీరందాల్సి ఉండగా ప్రస్తుతం రెండు వేల ఎకరాలకు కూడా సరిగ్గా నీళ్లు అందడం లేదు. నీళ్లు వదిలితే కాలువల గట్లపై నుంచి పొంగి వృథాగా పోతున్నాయని రైతులు వాపోతున్నారు. నిజామాబాద్? జిల్లాలోని శ్రీరాంసాగర్ జలాశయం నుంచి కమ్మర్‌పల్లి, వేల్పూర్, బాల్కొండ, మెండోరా మండలాల్లోని 25,763 ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్మి కాలువ ద్వారా యాసంగి సీజన్?కు ఏటా 3 టీఎంసీల నీటిని విడుదల చేస్తారు. చాలా చోట్ల కాలువ లైనింగ్ దెబ్బతిని ధ్వంసమైంది. గడ్డిమైదానం మాదిరి కనిపిస్తున్నప్పటికీ ఇది నాగార్జునసాగర్ లెఫ్ట్? బ్యాంక్ కెనాల్. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం తనికెళ్ల సమీపంలోనిది ఈ చిత్రం. 2.52 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు నీటిని అందించే ఈ కాలువలో పలు చోట్ల ఇప్పటికీ పూడికతీత కొనసాగడం గమనార్హం. మరమ్మతులకు ఇప్పటికీ టెండర్లు పిలవలేదు.


**నిధుల మంజూరుకు సీఎం ఆదేశాలు**

ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణలోని అన్ని ప్రాజెక్టుల ఓ అండ్ ఎం నిధులపై సమీక్ష నిర్వహించి రూ.360 కోట్లు విడుదలకు తక్షణమే ఆదేశాలు జారీ చేశారు. పనులు చేపట్టాలని చీఫ్? ఇంజినీర్?లకు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. ఓ అండ్ ఎం విభాగానికి మూన్నెల్లకోసారి రూ.70 కోట్ల చొప్పున ఏడాదికి రూ.280 కోట్లు వినియోగించుకునే వెసులుబాటు కూడా ఉంది. కానీ, క్షేత్రస్థాయిలో సరైన పరిశీలన లేకపోవడం, ప్రధాన కార్యాలయం నుంచి అనుశీలన లేకపోవడంతో నిర్వహణ తూతూమంత్రంగా తయారైంది.

## చింతకాని సభను చారిత్రాత్మకం చేయాలి

- 30న రెండు లక్షల మందితోసీఎం సభ
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- రాష్ట్రవ్యాప్తంగా రైతు భరోసా నిధుల విడుదల

**టిమీడియా, జూన్22, చింతకాని:**



రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతుల ఖాతాల్లోకి 'రైతు భరోసా' నిధులను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా విడుదల చేసేందుకు రాబోయే 30వ తేదీన చింతకానిలో రెండు లక్షల మందితో నిర్వహించ తలపెట్టిన భారీ బహిరంగ సభను మధిర శాసనసభ నియోజకవర్గ చరిత్రలోనే మున్నెన్నడూ లేని విధంగా చారిత్రాత్మక విజయం చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. సోమవారం చింతకాని మండలం జగన్నాధపురం క్రాస్ రోడ్స్ వద్ద మధిర నియోజకవర్గ కాంగ్రెస్ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులతో ఆయన ప్రత్యేక సమన్వయ సమావేశాన్ని నిర్వహించి, సభ ఏర్పాట్లు మరియు జన సమీకరణపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మధిర నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తున్న మొట్టమొదటి భారీ బహిరంగ సభ ఇదేనని స్పష్టం చేశారు. పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడిన మన ప్రాంతం నుంచే, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కోట్ల మంది రైతుల ఇళ్లలోకి ఒకే క్లిక్‌తో డబ్బులు వేసే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుడుతోందని చెప్పారు. ఈ చారిత్రాత్మక ఘట్టానికి గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రులందరూ తరలివస్తున్నట్లు వెల్లడించారు. మన నియోజకవర్గంలోని ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చే ఇలాంటి కార్యక్రమం ద్వారా రాష్ట్రానికి ఒక బలమైన సందేశాన్ని ఇవ్వాలన్నదే మన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. సభకు వచ్చే రైతులు, ప్రజలకు రవాణా పరంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా

మిగతా 3లో..

## ఫేక్ వీడియో -విజయవంతంగా నీట్ రీ ఎగ్జామ్

- వివరణ ఇచ్చిన ఎన్‌టీఏ

**టి మీడియా, జూన్ 22, ఢిల్లీ బ్యూరో :**

దేశవ్యాప్తంగా ఆదివారం జరిగిన నీట్ యూజీ రీ-టెస్ట్ ప్రశ్నాపత్రం లీక్ అయ్యిందని సోషల్ మీడియాలో ప్రచారమవుతున్న వీడియో నకిలీదని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) తెలిపింది. నీట్ యూజీ పరీక్షను కట్టుదిట్టమైన భద్రత, నిఘా మధ్య విజయవంతంగా నిర్వహించామని పేర్కొంది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. మరోవైపు, ఈ వీడియో ఫేక్ అని కేంద్ర ప్రభుత్వం కూడా చెప్పింది. నీట్ యూజీ పేపర్ లీక్ ఆరోపణలు నిరాధారమైనవని, అసత్యమైనవని ప్రభుత్వ అధికారిక నిజ నిర్ధరణ విభాగమైన ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) స్పష్టం చేసింది.

**వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం : ఎన్‌టీఏ**




నీట్ యూజీ- 2026 రీ ఎగ్జామ్?కు సంబంధించి సోషల్ మీడియాలో ప్రచారమవుతున్న ఒక కల్పిత వీడియో తమ దృష్టికి వచ్చిందని ఎన్‌టీఏ ప్రకటించింది. ఆ వీడియో నకిలీదని, అందులోని వాదనలు అవాస్తవమని స్పష్టం చేసింది. విద్యార్థులను తప్పుదోవ పట్టించడానికి, వారిలో ఆందోళన కలిగించడానికి ఇటువంటి తప్పుడు సమాచారాన్ని సృష్టించడం, ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేయడాన్ని తీవ్రమైన నేరంగా అభివర్ణించింది. ఇండియన్ సైబర్ క్రైమ్ కో-ఆర్డినేషన్ సెంట ర్(ఐ4సీ), చట్ట అమలు సంస్థల సహకారంతో ఈ కంటెంట్‌ను సృష్టించిన వారిపై చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. పరీక్షకు సంబంధించిన సమాచారం కోసం ఎన్‌టీఏ అధికారిక వెబ్‌సైట్, ధ్రువీకరించిన సోషల్ మీడియా ఖాతాలను అనుసరించాలని సూచించింది. ఇటువంటి తప్పుడు సమాచారాన్ని మరింతగా ప్రచారం చేయవద్దని విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలకు విజ్ఞప్తి చేసింది. 20 లక్షలకు పైగా నీట్ అభ్యర్థులు ప్రశాంతమైన, నిష్పక్షపాతమైన ప్రక్రియకు అర్హులని పునరుద్ఘాటించింది.

**ఎగ్జామ్‌కు 20 లక్షల మంది హాజరు** పేపర్ లీక్ కారణంగా రద్దైన నీట్ యూజీ ప్రవేశ పరీక్షను ఆదివారం మళ్లీ ఎన్‌టీఏ నిర్వహించింది. ఈ ఎగ్జామ్‌కు 20 లక్షల మందికి పైగా అభ్యర్థులు హాజరైనట్లు వెల్లడించింది. ప్రభుత్వ యంత్రాంగం మొత్తం

మిగతా 3లో..

# గవర్నమెంట్ బస్సు డ్రైవర్‌గా ట్రాన్స్‌జెండర్

- **కష్టాలను దాటి.. స్టీరింగ్ పట్టిన శ్రీదేవి**

**టి మీడియా, జూన్ 22,చెన్నై :**

లింగ వివక్ష నిర్మూలన, సామాజిక సాధికారత దిశగా తమిళనాడు ప్రభుత్వం ఒక చారిత్రాత్మక అడుగు వేసింది. సమాజంలో ఎన్నో అవమానాలు, సవాళ్లను ఎదుర్కొనే ట్రాన్స్‌జెండర్లకు ప్రభుత్వ రంగంలో సముచిత స్థానం కల్పిస్తూ.. రాష్ట్ర చరిత్రలోనే మొట్టమొదటిసారిగా ఒక ట్రాన్స్‌జెండర్‌ను ప్రభుత్వ బస్సు డ్రైవర్‌గా నియమించింది. తమిళనాడు స్టేట్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ లో డ్రైవర్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీదేవి అనే ట్రాన్స్ మహిళ ఈ అరుదైన ఘనత సాధించి సరికొత్త రికార్డు సృష్టించారు.



**కష్టాలను దాటి.. స్టీరింగ్ పట్టిన శ్రీదేవి**

పుదుకోట్టై జిల్లాలోని కీరనూర్ గ్రామానికి చెందిన శ్రీదేవి.. చిన్నతనం నుంచే ఎన్నో ఆర్థిక, సామాజిక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. డ్రైవింగ్‌పై ఉన్న మక్కువతో ఆమె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్‌లో చేరి హెవీ వెహికల్ (భారీ వాహనాల) డ్రైవింగ్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. ఎంతో కఠినమైన పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసి హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌ను సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం ఆమె పుదుకోట్టై కొత్త బస్టాండ్ నుండి తిరుచిరాపల్లి (తిరుచ్చి) -- రామేశ్వరం మధ్య ఉన్న అత్యంత రద్దీగా ఉండే రూట్‌లో బస్సు నడుపుతున్నారు.

**పర్మినెంట్ చేయాలని డిమాండ్**

రూట్‌లో బస్సు నడిపే సమయంలో శ్రీదేవి ప్రదర్శిస్తున్న వృత్తిపరమైన నిబద్ధత, సమయపాలన సురక్షితమైన డ్రైవింగ్ శైలిని చూసి తోటి సిబ్బందితో పాటు ప్రయాణికులు సైతం అభినందనలు కురిపిస్తున్నారు. ప్రస్తుతం శ్రీదేవి తాత్కాలిక డ్రైవర్‌గా విధుల్లో చేరినప్పటికీ.. ఆమె ప్రతిభను చూసిన స్థానిక ప్రజలు ఆమె ఉద్యోగాన్ని వెంటనే పర్మినెంట్ చేయాలని రవాణా శాఖ అధికారులను కోరుతున్నారు. ఈ విజయం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎంతో మంది ట్రాన్స్‌జెండర్లకు గొప్ప స్ఫూర్తిని ఇస్తుందని సామాజిక విశ్లేషకులు భావిస్తున్నారు.

**పుదుకోట్టై జిల్లా ఖాతాలో మరో అరుదైన రికార్డు**

తమిళనాడు రవాణా సంస్థ ఇటువంటి సామాజిక విప్లవానికి తెరలేపడం ఇదే మొదటిసారి కాదు. గతంలో ఇదే పుదుకోట్టై జిల్లాకే చెందిన కళాదేవి అనే ట్రాన్స్‌జెండర్ రాష్ట్రంలోనే తొలి ప్రభుత్వ బస్సు కండక్టర్‌గా నియామకమై దేశవ్యాప్తంగా వార్తల్లో నిలిచారు. ఇప్పుడు అదే జిల్లాకు చెందిన శ్రీదేవి డ్రైవర్‌గా రావడం విశేషం. ఒకే జిల్లాకు చెందిన ఇద్దరు ట్రాన్స్ మహిళలు రవాణా శాఖలో కీలక బాధ్యతలు చేపట్టడం గమనార్హం.

**మహిళా ప్రయాణికుల్లో పెరిగిన ఆత్మవిశ్వాసం**

శ్రీదేవి నియామకాన్ని బస్సులో ప్రయాణించే మహిళా ప్రయాణికులు ప్రత్యేకంగా స్వాగతిస్తున్నారు. ఒక ట్రాన్స్ మహిళ ఇంత పెద్ద ప్రభుత్వ బస్సును ఇంతటి ఆత్మవిశ్వాసంతో, పట్టుదలతో నడపడం తమకు ఎంతో గర్వకారణంగా ఉందని మహిళలు కొనియాడుతున్నారు. సమాజంలో లింగ గుర్తింపుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు, తగిన అవకాశాలు కల్పిస్తే ఏ రంగంలోనైనా అద్భుతాలు సృష్టించవచ్చనే బలమైన సందేశాన్ని ఈ ఘటన ఇస్తోంది.

# వ్యవసాయ రంగంలో వెన్నెముకగా తెలంగాణ

- **జిల్లా బారసా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్**

**టీ మీడియా, జూన్ 22, వనపర్తి బ్యూరో :**




వనపర్తి జిల్లా ఘణపురం, గోపాల్ పేట్ మండలాలలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు నష్టపరిచే విధంగా చేసిన అంశాలపై బిఆర్ఎస్ నాయకులు సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. జిల్లా బారసా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన పనులలో కాంగ్రెస్ ప్రభుత్వం సగం చేస్తే శభాష్ పావు సగం చేస్తే చప్పట్లు, దేశానికి గత 10 సంవత్సరాల లో వ్యవసాయ రంగంలో వెన్నెముకగా తెలంగాణ రాష్ట్రం నిలిచింది. .మాజీ ఎంపీపీ కృష్ణా నాయక్ మాట్లాడుతూ ఎర్రటి ఎండల్లో ఘనప సముద్రాన్ని అలుగు పారించిన ఘనత మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ది.ఆరోజు దాదాపు మండలంలో 25 వేల ఎకరాలకు సాగునీరు అందించారు. ఘనప సముద్రంతో పాటు మండలంలో మిగిలిపోయిన అటువంటి గిరిజన తండాలు మరికొన్ని గ్రామాలకు 5,000 ఎకరాలకు సాగు నీరు అందించాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తో మాట్లాడి కర్నేతాండా లిఫ్ట్ ద్వారా నీళ్లు పారించడానికి కృషి చేశారు. ఘనప సముద్రంకు నీళ్లు వచ్చిన తర్వాత ముంపుకు గురైనటువంటి 600 ఎకరాల భూములకు సంబంధించిన రైతులు మా ప్రాంతానికి మేలు జరిగింది కానీ మునిగిపోయిన రైతులం నష్టపోతున్నామని పల్లె నిద్రకు వచ్చిన నిరంజన్ రెడ్డితో మొరపెట్టుకున్నారు.ఘనప సముద్రాన్ని రిజర్వాయర్ చేస్తే తప్ప పరిహారానికి పూర్తి న్యాయం జరగదని రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా మంజూరు చేయించి రైతులకు నష్టపరిహారం వచ్చే విధంగా కృషి చేశారు.ఇప్పుడున్న ఎమ్మెల్యే ఇంకా కొంతమంది కలిసి కొంతమంది రైతులకు నష్టపరిహారం తీసుకోవడానికి ఇప్పుడు సంతకాలు పెట్టవద్దు.కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే 20 నుండి 25 లక్షలు నష్టపరిహారం వచ్చే విధంగా చేస్తామని బస్టాండ్ లో బహిరంగ సభలో చెప్పి రైతులను మోసం చేసినందుకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# రాష్ట్రానికి రానున్న 891 మంది ఏపీ ఉద్యోగులు

**సర్కార్ పునరాలోచించాలి:టి ఎన్ జి ఓ**

**టి మీడియా, జూన్ 22,హైదరాబాద్:**

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఉద్యోగులను తెలంగాణకు కేటాయించే అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. ఏపీలో పనిచేస్తున్న 891 మంది ఉద్యోగులను తెలంగాణకు అంటగట్టబోతున్నారు. ఈ మేరకు తమ రాష్ట్ర ఉద్యోగులను తీసుకొనేందుకు తెలంగాణ ప్రభుత్వ సమ్మతి కోరుతూ ఏపీ జీఏడీ అధికారులు తెలంగాణ సీఎస్‌కు లేఖ రాశారు. తెలంగాణ ప్రభుత్వం వీరికి గ్రీన్‌సిగ్నల్ ఇస్తే ఈ 891 మంది ఉద్యోగులు తెలంగాణకు వస్తారు.గత పన్నేండ్లలో 2,800 మంది ఉద్యోగులు ఏపీ నుంచి తెలంగాణకు వచ్చారు. కొంతకాలం క్రితం రేవంత్‌రెడ్డి సర్కార్ 122 మంది గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగులను ఏపీ నుంచి తెలంగాణకు రప్పించింది. తాజాగా మరో 891కి తెలంగాణకు పంపుతామంటూ ఏపీ లేఖ రాసింది. ఏపీ ఉద్యోగుల



రాకను తెలంగాణ ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ ఉద్యోగులను అనుమతించే విషయంలో సర్కార్ పునరాలోచించాలని తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం హైదరాబాద్ సిటీ బ్రాంచి అధ్యక్షుడు కస్తూరి శ్రీకాంత్ డిమాండ్ చేశారు.

**ఏపీకి వెళ్తామన్న వారిపై..**

ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు వచ్చే వారికి రెడ్‌కార్పెట్ పరుస్తున్న సర్కార్.. తెలంగాణ నుంచి ఏపీకి వెళ్తామన్న వారి విషయంలో మాత్రం మీనమేషాలు లెక్కిస్తున్నది. 1,369 మంది టీచర్లు, ఉద్యోగులు తాము తెలంగాణలో ఉండలేమని, ఇక్కడ పనిచేయలేమని, తమను ఏపీకి పంపాలని మొత్తుకుంటున్నా పంపించడంలేదు. వీరంతా ఏపీ స్థానికత గల ఉద్యోగులే. వీరిలో టీచర్లు, జిల్లా, జోనల్, మల్టీజోనల్ ఉద్యోగులున్నారు.వీరిలో 600 మంది టీచర్లున్నారు. 200 మంది వరకు 30% హెచ్‌ఆర్‌ఏలోనే పనిచేస్తున్నారు. 1,369 మందిని ఏపీకి పంపిస్తే జీతాలు, హెచ్‌ఆర్‌ఏ మిగులుతుందని.. అయినా సర్కార్ ఈ విషయాన్ని పట్టించుకోవడంలేదని నాన్ లోకల్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ వాపోయారు. ఏపీ నుంచి తెలంగాణకు ఉద్యోగులను కేటాయించినట్టే.. తెలంగాణలోని వారిని ఏపీకి పంపించాలని డిమాండ్ చేస్తున్నారు.

# బావిలో పూడిక తీయటానికి దిగి ఇద్దరు

- **రోడ్డు ప్రమాదంలో మరో ఇద్దరు**

**టి మీడియా, జూన్ 22, అమరావతి బ్యూరో :**



రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో జరిగిన వివిధ ప్రమాద ఘటనల్లో పలువురు మృతి చెందారు. ఏలూరు జిల్లాలో బావిలో పూడిక తీయటానికి దిగిన ఇద్దరు వ్యక్తులు ఊపిరాడక మృతి చెందారు. తిరుపతి జిల్లా పుల్లంపేట మండలం ఉడుంవారిపల్లి వద్ద సోమవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఓ ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా 15 మందికి తీవ్ర గాయాలయ్యాయి. కడప జిల్లాలో పాపాగ్ని నదిలో అక్రమ ఇసుక తవ్వకాల వల్ల ఏర్పడిన లోతైన గుంత ఇద్దరు అన్నదమ్ముల ప్రాణాలను బలిగొంది.ఏలూరు జిల్లా పోలవరం మండలంలో విషాదం చోటు చేసుకుంది. బావిలో పూడిక తీయటానికి దిగిన ఇద్దరు వ్యక్తులు ఊపిరాడక మృతి చెందారు. ఈ ఘటన నేడు (సోమవారం) జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పోలవరం గ్రామానికి చెందిన బండి వీర వెంకట్రావు, చిట్టిబాబులు కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటారు. పోలవరం గ్రామంలోని నూతనగూడెం వద్ద మునేశ్వరరావు అనే వ్యక్తి ఇంట్లో 40 అడుగులకు పైగా లోతున్న బావి ఉంది. ఆ బావిలో పూడికి తీసేందుకు వీరిద్దరూ వెళ్లారు.

**ఒకరి కోసం వెళ్లి మరొకరు**

అయితే ముందుగా చిట్టిబాబు బావిలోకి దిగి చూస్తుండగా ఊపిరి ఆడకపోవడంతో కేకలు వేశాడు. గమనించిన వీర వెంకటరావు సైతం తాళ్ల సహాయంతో బావిలోకి దిగాడు. ఈ క్రమంలో ఇద్దరికీ ఊపిరి ఆడకపోవడంతో బావిలోనే మృత్యువాత పడ్డారు. లోపల ఏం జరిగిందో తెలియదు గానీ, దిగిన కాసేపటికే సదరు వ్యక్తుల నుంచి స్పందన కరవైంది. కంగారుపడిన ఇంటి యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. కొవ్వూరు అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్నారు. నూతిలో ఉన్న ఇద్దరిని ప్రాణాలతో బయటకు తీయటానికి ప్రయత్నించారు. దురదృష్టవశాత్తూ వారిద్దరూ చనిపోగా, ఇద్దరి మృతదేహాలను బయటకు తీశారు. వారి వయస్సు 45 నుంచి 55 సంవత్సరాల మధ్య ఉంటుందని పోలీసులు తెలిపారు.

## హైవేపై ఘోర ప్రమాదం..ముక్కలైన శరీర భాగాలు

**టి మీడియా, జూన్ 22, వడోదరా :**



ముంబై-వడోదరా జాతీయ రహదారిపై ఊహించని రీతిలో ఒక ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మితిమీరిన వేగం, మద్యం మత్తు కలిసి ముగ్గురు యువకుల జీవితాలను క్షణాల్లో ఛిన్నాభిన్నం చేశాయి. దాదాపు 250 కిలోమీటర్ల బుల్లెట్ వేగంతో దూసుకెళ్తున్న ఒక లగ్జరీ బీఎండబ్ల్యూకారు ఒక్కసారిగా నియంత్రణ కోల్పోయి రహదారి మధ్యలో ఉన్న డివైడర్‌ను అత్యంత బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదం ఎంత భీకరంగా జరిగిందంటే.. డివైడర్‌ను ఢీకొట్టిన వెంటనే కారు గాల్లోకి లేచి పలుమార్లు బోల్తా పడింది. ఈ దారుణ ఘటనలో బద్దాపూర్ ప్రాంతానికి చెందిన యోగేశ్, జాకప్ అనే ఇద్దరు యువకులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కారు టాప్ స్పీడ్‌లో ఉండటం వల్ల ప్రమాద తీవ్రతకు వాహనం నలిగిపోవడమే కాకుండా, మృతుల శరీర భాగాలు ముక్కలై ఘటనా స్థలానికి కొన్ని మీటర్ల దూరంలో రోడ్డుపై ఎగిరిపడ్డాయి. అక్కడ ఉన్న ప్రత్యక్ష సాక్షులను ఈ దృశ్యం తీవ్రంగా కలచివేసింది.


**బర్త్ డే పార్టీలో మితిమీరిన మద్యం**

ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న మూడో వ్యక్తి ఆనంద్ తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డాడు. ప్రస్తుతం అతడిని సమీప ఆసుపత్రికి తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. పోలీసుల ప్రాథమిక విచారణలో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రమాదానికి గురైన యువకులు అంతకుముందే ఒక బర్త్ డే పార్టీలో పాల్గొని పెద్ద ఎత్తున మద్యం సేవించినట్లు అధికారులు నిర్ధారించారు. మద్యం మత్తులో వేగ పరిమితులను పూర్తిగా విస్మరించి, కారును మృత్యుశకటంగా మార్చడమే ఈ ఘోరానికి ప్రధాన కారణమని పోలీసులు తెలిపారు. అతివేగం, డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల జరిగిన ఈ ఘోర ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు జరుపుతున్నారు.

# క్రీడలకు ప్రాధాన్యతనివ్వాలి

- **డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి**

**టీ మీడియా, జూన్ 22, వనపర్తి బ్యూరో :**



40వ ఒలంపిక్స్ డే సందర్భంగా తెలంగాణ బాక్సింగ్ అసోసియేషన్ వాళ్లు టార్చ్ రన్ ను వనపర్తి జిల్లా కేంద్రం డాక్టర్ బాలకృష్ణయ్య స్టేడియంలో నిర్వహించారు. ఒలంపిక్స్ డే టార్చ్ రన్ కు ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి పాల్గొన్నారు. చిన్నారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం నుంచి ఒలంపిక్స్ కు ఆడే విధంగా క్రీడాకారులను తయారు చేయాలని ఉద్దేశంతో 576 కోట్ల బడ్జెట్ ను కేటాయించి క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారని అన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండి క్రీడలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసాన్ని అందిస్తాయి అని అన్నారు.టార్చ్ ను వెలిగించి రన్ ను ప్రారంభించారు.ఈ టార్చ్ రన్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ చిన్నారెడ్డి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వనపర్తి జిల్లా అడిషనల్ ఎస్పీ రాజేష్ మీనా, వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వనపర్తి జిల్లా క్రీడల అధికారి సుధీర్ రెడ్డి, జిల్లా బాక్సింగ్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి,జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు బ్రహ్మం, బాబా, మన్యం యాదవ్, నాగార్జున, చరణ్, సురేష్, రామ్ జి నాయక్, నందిమల్ల రాము, వెంకటేష్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## అడిగిన వెంటనే నీళ్లు ఇవ్వలేదని కన్నతల్లిని చంపేసిన కసాయి కొడుకు

**టి మీడియా, జూన్ 22, కాకినాడ :**



ఏపీలో దారుణం చోటు చేసుకుంది. అడిగిన వెంటనే నీళ్లు ఇవ్వలేదని కన్నతల్లిని చంపేశాడు ఓ కసాయి కొడుకు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడలో ఈ అమానవీయ ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..ఈ నెల 9వ తేదీన మధ్యాహ్న సమయంలో తల్లి నాగమణి (45) కొడుకు రాజబాబు భోజనం వడ్డించింది. తింటూ ఫ్రిడ్జ్ లోని నీళ్లు తెమ్మని తల్లిని అడిగాడు.కాస్త ఆలస్యం కావడంతో రాజబాబు లేచి గట్టిగా అరుస్తూ ఫ్రిడ్జ్ దగ్గరికి వెళ్తుండగా గుమ్మానికి గుద్దుకుని రాజబాబుకు గాయమైంది. దీంతో రాజబాబు విచక్షణ కోల్పోయి తల్లి తలను పూజ గదిలోని చెక్క బల్లకేసి బలంగా కొట్టి దాడి చేశాడు. గమనించిన స్థానికులు నాగమణిని కాకినాడ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ నాగమణి మృతి చెందింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## అమెరికాలో మరో తెలంగాణ విద్యార్థి బలి..

- **అనారోగ్యంతో అకస్మాత్తుగా మృతి**

**టి మీడియా, జూన్ 22, మహబూబ్‌నగర్:**




ఉన్నత విద్య కోసం కొంతకాలం కిందట అమెరికాకు వెళ్లిన అరుణ్ ఫ్లోరిడాలో నివసిస్తున్నాడు. టెంపాలో స్టెమ్ ఓపీటీ (ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్)గా ఉన్నాడు. ప్రస్తుతం ఫుల్ టైమ్ జాబ్ కోసం ప్రయత్నిస్తున్నాడు. ఈ క్రమంలో జూన్ 13వ తేదీన అరుణ్ ఉన్నట్టుండి అనారోగ్యానికి గురయ్యాడు. వెంటనే ఆస్పత్రికి తరలించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. చికిత్స పొందుతూ కాసేపటికే అరుణ్ మరణించాడు. ఈ విషయం తెలియడంతో అతని స్వగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి

# యథేచ్ఛగా లింగనిర్ధారణ, గర్భ విచ్ఛిత్తి

- **క్లినిక్‌ల నుంచి ఆస్పత్రుల వరకు ఇదే తంతు**

**టి మీడియా, జూన్ 22,హైదరాబాద్ బ్యూరో:**



హైదరాబాద్? నగరంలో అక్రమ లింగనిర్ధారణ, గర్భ విచ్ఛిత్తి కార్యకలాపాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. చిన్నచిన్న క్లినిక్‌లు, నర్సింగ్‌హోంల నుంచి పెద్ద ఆస్పత్రుల వరకు ఈ తంతు కొనసాగుతోంది. ఇటీవల ఉదంతాలే ఇందుకు తార్కాణమని చెప్పవచ్చు. ఎల్బీనగర్ పోలీసులు చేసిన డెకాయ్ ఆపరేషన్‌లో పలు విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. వనస్థలిపురంలోని హయగ్రీవ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్? నుంచి కేసరి ఫస్ట్ ఎయిడ్ క్లినిక్, శ్రీసాయి ధనుష్ క్లినిక్ ఇలా పలు హాస్పిటల్స్ పాత్ర తేటతెల్లమైంది. గొలుసుకట్టు మాదిరిగా ఒక క్లినిక్ నుంచి ఇంకోటి అక్కడ నుంచి మరొక ఆస్పత్రికి సంబంధాలు ఉన్నాయి. ఈవిధంగా ఒకరికొకరు సహకరించుకుంటూ అక్రమాలకు పాల్పడుతున్నట్లుగా స్పష్టమవుతోంది.

**పర్యవేక్షణ అంతంతమాత్రమే**

గ్రేటర్ వ్యాప్తంగా దాదాపు 1000కి పైగా స్కానింగ్ సెంటర్లు ఉన్నాయి. ఆయా సెంటర్లపై వైద్య ఆరోగ్యశాఖాధికారుల పర్యవేక్షణ లోపం తాజా ఘటనతో తేటతెల్లమైంది. పోలీసులు చేపట్టిన డెకాయ్ ఆపరేషన్‌లో నిర్వాహకులు ఏమాత్రం జంకు లేకుండా వచ్చినవారు ఎవరనేది ఆరా తీయకుండా అబార్షన్‌తోపాటు లింగనిర్ధారణ పరీక్షలకు అంగీకరించి అడ్వాన్సులను సైతం వసూలు చేశారంటే ఈ అక్రమాలు ఏ స్థాయిలో జరుగుతున్నాయది అర్థం చేసుకోవచ్చు. కొన్ని సెంటర్ల నుంచి నెలవారీగా మామూళ్లు అందుతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. ఫలితంగా పలు స్కానింగ్ సెంటర్లు పీసీ-పీఎన్‌డీటీ చట్టం నిబంధనలను గాలికొదిలేస్తున్నాయి. గతంలో కూడా నాంపల్లి, మలక్‌పేట్, సికింద్రాబాద్, ఎల్బీనగర్ ప్రాంతాల్లో ఈ తరహా మోసాలు వెలుగులోకి వచ్చాయి. సంబంధిత అధికారుల నిరంతర నిఘా లేకపోవడం వల్లే ఈ పరిస్థితికి కారణం. సామాజిక పరమైన అవగాహన లేకుండా కొంతమంది స్కానింగ్ సెంటర్లు, ఆస్పత్రుల బాట పడుతుండటంతో వారి నుంచి భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారు.

**అసలు చట్టం ఏం చెబుతుంది**

పీసీపీఎన్‌డీటీ చట్టం ప్రకారం గర్భంలో ఉన్న బిడ్డ ఆడ లేదా మగ అని చెప్పడం నేరం. స్కానింగ్ కేంద్రాల్లో డాక్టర్లు లేదా టెక్నీషియన్లు గర్భస్థ శిశువు ఆడ, మగ అని చెప్పడం, రాయడం, సైగ చేయడం కూడా నేరమే అవుతుంది. ప్రతి గర్భిణికి స్కాన్ చేసినప్పుడు కారణం, తల్లిదండ్రుల వివరాలు ఫారం ఎఫ్‌లో తప్పనిసరిగా నమోదు చేయాల్సి ఉంటుంది.ప్రతి నెలా ఈ వివరాలు వైద్య ఆరోగ్యశాఖకు సమర్పించాల్సి ఉంటుంది. చట్టాన్ని అతిక్రమించినట్లయితే మొదటి తప్పునకు 3 ఏళ్లు జైలు, రూ.10 వేల జరిమానా, రెండోసారి చేస్తే అయిదేళ్ల జైలు, రూ.50 వేల వరకు జరిమానాతోపాటు స్కానింగ్ సెంటర్, హాస్పిటల్? గుర్తింపు రద్దు చేయవచ్చు. హైదరాబాద్? నగరంలో పీసీపీఎన్?డీటీ చట్టం సక్రమంగా అమలు కావడం లేదన్నది బహిరంగ రహస్యం. అధిక శాతం సెంటర్లలో ఫారం ఎఫ్‌ను నింపడం లేదు. కొన్ని ప్రాంతాల్లో ప్యాకేజీల పేరుతో గుట్టుగా లింగ నిర్ధారణ పరీక్షలు సైతం చేస్తున్నారు. దీనిపై అధికారులు దృష్టిసారించి అలాంటి కేంద్రాలపై దాడులు నిర్వహించాల్సి ఉందని నగరవాసులు కోరుతున్నారు.

**వనస్థలిపురంలో గుట్టురట్టు**

ర్భంలో ఉన్న బిడ్డ ఆడ, మగ అని తేల్చేస్తూ, చట్టానికి వ్యతిరేకంగా దందా సాగిస్తున్న ముఠా నెట్‌వర్క్‌ను ఇటీవల హైదరాబాద్ నగర శివారులోని వనస్థలిపురం పోలీసులు ఛేదించారు. పోలీసులు సినీ ఫక్కీలో డెకాయ్ ఆపరేషన్ చేపట్టి నిందితులను పక్కా ఆధారాలతో అరెస్టు చేశారు.వివరాల్లోకి వెళితే, రంగారెడ్డి జిల్లాలోని వనస్థలిపురంలోని హయగ్రీవ హాస్పిటల్?లో గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నాయని పోలీసులకు కొద్దిరోజుల క్రితం సమాచారం అందింది. దీంతో పోలీసులు నిందితులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవాలని పక్కా ప్లాన్ వేశారు. నిందితులను బురిడీ కొట్టించేందుకు పోలీసులు ఓ మహిళా పోలీసు అధికారిని గర్భిణిగా నటింపచేసి కీలక వివరాలను సేకరించి నిందితులను పట్టుకున్నారు.

# 'కేవైసీ'ని మీ ఇంటి నుంచే పూర్తి చేయవచ్చు

- **జూన్ 30 కేవైసీ ప్రక్రియను పూర్తి చేయడానికి చివరి తేదీ**

**టి మీడియా, జూన్ 22,హైదరాబాద్ బ్యూరో:**



నిత్యం వినియోగించే ఎల్?పీజీ వంట గ్యాస్ వినియోగంలో అక్రమాలు జరుగుతున్నాయి. వీటికి చెక్? పెట్టేందుకు 2023లో కేవైసీని ప్రవేశపెట్టారు. దాదాపుగా మూడు సంవత్సరాలు అవుతున్నప్పటికీ ఇప్పటికీ చాలా మంది ఈ ప్రక్రియను పూర్తి చేయలేదు. వినియోగదారులు జూన్? 30 లోపు కేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలని పౌర సరఫరాల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గ్యాస్ ఏజెన్సీల డీలర్ల వద్ద ఈ - కేవైసీ పూర్తి చేసే అవకాశం ఉంది. అయితే డీలర్ల వద్ద జనం ఎక్కువ సంఖ్యలో బారులు తీరాల్సిన అవసరం లేదు. ఎందుకంటే మీ కేవైసీని ఇంటి వద్దనే ఫోన్?లో యాప్? ద్వారా ఈ - కేవైసీ చేసుకొనే వెసులుబాటు గ్యాస్? కంపెనీలు కల్పించాయి. మరి ఈ కేవైసీని ఎలా చేయాలి? వివరంగా తెలుసుకుందాం.

మీమీ గ్యాస్? కనెక్షన్లను ఆధార్?తో అనుసంధానం చేయడంతో పాటు ముఖ గుర్తింపు, వేలిముద్రలు లేదా ఐరిస్ వంటి 3 విధానాలతో ఎల్?పీజీ వినియోగదారులు ఈ - కేవైసీని పూర్తి చేయవచ్చు.

**'హెచ్‌పీ' గ్యాస్ :** ప్లేస్టోర్? నుంచి హెచ్?పీ పే, ఆధార్ ఫేస్? ఆర్డీ యాప్?లను డౌన్?లోడ్? చేసుకోవాలి. ఆ యాప్?లను ఓపెన్ చేసి రిజిస్టర్?పైన క్లిక్ చేయాలి. మీ గ్యాస్? అకౌంట్?కు లింక్ అయిన మొబైల్? నంబర్? ఎంటర్ చేసి ఓటీపీ వెరిఫై చేసి లాగిన్ అవ్వాలి.ఆ తర్వాత హోమ్? పేజీలో 'మై హెచ్?పీ' సెక్షన్?కు వెళ్లి 'ఎల్?పీజీ' ఆప్షన్?పై క్లిక్ చేయాలి.మీకు ఇపుడు ఇ - కేవైసీ ఆప్షన్? కనిపిస్తుంది. దీనిపై క్లిప్ చేసి స్క్రీన్?పై చూపించే , సూచనలను పాటించాలి.కాప్చర్? ఫేస్?పై క్లిక్? చేస్తే కొన్ని సూచనలు చేస్తుంది.తర్వాత మీ ముఖాన్ని స్కాన్? చేస్తే ఈ - కేవైసీ పూర్తవుతుంది.

**'ఇండేన్' గ్యాస్ :** గ్యాస్ వినియోగదారులు ప్లేస్టోర్? నుంచి 'ఇండియన్? ఆయిల్? వన్?' 'ఆధార్? ఫేస్? ఆర్డీ' యాప్?లను డౌన్?లోడ్ చేసుకోవాలి.

ఈ యాప్?ను ఓపెన్? చేసి గ్యాస్? కనెక్షన్?కు లింక్? అయిన ఫోన్ నంబర్ లేదా మెయిల్?తో పాస్?వర్డ్?ను క్రియేట్ చేసి లాగిన్? అవ్వాలి. మీరు మొదటిసారి ఉపయోగిస్తే 'సైన్? అప్?'పై క్లిక్? చేసి రిజిస్ట్రేషన్? పూర్తి చేసుకోవాలి.మీ గ్యాస్? క్యాష్?మెమో లేదా సబ్?స్క్రిప్షన్? వోచర్?పై ఉండే 16 అంకెల ఎల్?పీజీఐడీని లింక్ చేయాలి. అప్పుడు మీ కస్టమర్ వివరాలు కనిపిస్తాయి.లాగిన్? అయ్యాక హోమ్? పేజీలో 'ప్రొఫైల్?' పై క్లిక్ చేస్తే ఆధార్ ?లింక్?డ్ అండ్ 'ఈ - కేవైసీ' స్టేటస్? కనిపిస్తుంది.గ్రీన్? కలర్?లో రైట్?మార్క్? ఉంటే మీ కేవైసీ పూర్తయినట్లే. ఒకవేళ కాకపోతే అక్కడే రీ - అంథటికేట్? బటన్ నొక్కి మీ ముఖాన్ని స్కాన్? చేసి బయోమెట్రిక్ వెరిఫికేషన్? పూర్తి చేసుకోవాలి.ఒకవేళ మీ ఆధార్ బయోమెట్రిక్ లాక్? అయి ఉంటే మొదటిగా దాన్ని అన్?లాక్ చేయాలి.

**'భారత్'? గ్యాస్ :** ప్లేస్టోర్? నుంచి హెలో బీపీసీఎల్?, ఆధార్ ఫేస్? ఆర్డీ యాప్?లను డౌన్?లోడ్ చేసుకోవాలి. యాప్? ఓపెన్ చేశాక రిజిస్టర్డ్ మొబైల్ నంబర్?తో ఓటీపీ వెరిఫికేషన్ పూర్తి చేసి లాగిన్ అవ్వాలి. యాప్? హోమ్? పేజీలోనే మీకు ఈ - కేవైసీ ఆప్షన్? కనిపిస్తుంది.దానిపై క్లిక్ చేసి మరోసారి ఓటీపీ వెరిఫై చేసుకోవాలి. ఆ తర్వాత ఈ - కేవైసీ ప్రాసెస్?కు సూచనలు చేస్తుంది. దానిని పాటిస్తూ కేవైసీ పూర్తి చేసుకోవాలి.వినియోగదారులు ఈ - కేవైసీ చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. నకిలీ వెబ్?సైట్?లు, సైబర్ నేరగాళ్ల పాలిట పడే అవకాశాలు ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కంపెనీ అధికారికంగా ప్రకటించిన వెబ్?సైట్?లను మాత్రమే ధ్రువీకరించుకుని ఈ - కేవైసీ పూర్తి చేసుకోవడం చాలా ఉత్తమం.

# నేతన్నకు భరోసా పథకం

- **రూ.25 వేల సాయం నేరుగా బ్యాంక్ ఖాతాల్లో జమ**

**టి మీడియా, జూన్ 22, అమరావతి బ్యూరో :**



ఏపీలో మరో కొత్త పథకం.. అకౌంట్లోకి నేరుగా రూ.25 వేలు.. ప్రారంభంపై ఏపీలోని కూటమి ప్రభుత్వం మరో పథకం అమలుకు సిద్ధమైంది. గత ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోంది. ఈ క్రమంలో మరో నూతన పథకాన్ని ప్రారంభించేందుకు సిద్ధమైంది. అదే నేతన్నకు భరోసా. త్వరలోనే ఈ పథకాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ విషయాన్ని ఏపీ చేనేత, జౌళిశాఖ మంత్రి సవిత అధికారికంగా ప్రకటించారు. ఈ స్కీమ్ కింద నేతన్నలకు ప్రతీ ఏడాది రూ.25 వేల ఆర్థిక సాయం అందించనున్నారు. ప్రతీ నేతన్న కుటుంబానికి వీటిని నేరుగా అకౌంట్లలో జమ చేయనున్నారు. త్వరలోనే ఈ పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను రూపొందించనున్నట్లు సవిత వెల్లడించారు. అలాగే చేనేత కార్మికులకు ఆరోగ్య బీమా పథకం కూడా అమలు చేయనున్నట్లు ప్రకటించారు.

**ఏపీలో నిఫ్ట్ కేంద్రం** అటు అమరావతిలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ(నిఫ్ట్) ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందని, త్వరలోనే ఆమోదం లభిస్తుందని సవిత తెలిపారు. ఇక అమరావతిలో హస్తకళల మ్యూజియం ఏర్పాటుపై కేంద్రానికి ప్రతిపాదనలు పంపామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేనేత కార్మికుల ఉపాధి మెరుగయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని, ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటున్నామన్నారు. చేనేతకు అండగా నిలిచేలా వారంలో ఒక రోజు చేనేత వస్త్రాలను ప్రతి ఒక్కరూ ధరించాలని ఆమె సూచించారు. చేనేతలకు 365 రోజుల పాటు ఉపాధి లభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ధర్మవరంలో రూ.38 కోట్లతో మెగా చేనేత క్లస్టర్ కేంద్రం మంజూరు చేయగా.. దీని ద్వారా 10 వేల మంది లబ్ధి చేకూరుతుందని అన్నారు. త్వరలో దీనికి శంకుస్థాపన జరగనుంది. అటు మంగళగిరిలో రూ.22 కోట్లతో, పిఠాపురంలో రూ.15 కోట్లతో చేనేత పార్క్ ఏర్పాటు చేయనుంది ప్రభుత్వం. ఇక మరో 10 చిన్న తరహా క్లస్టర్లు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వివరించారు.

**90 శాతం రాయితీతో మగ్గాలు** ఇక చేనేతలకు 90 శాతం రాయితీతో ఆధునిక మగ్గాలను అందిస్తున్నామని, లాగే చేనేత వస్త్రాలు, హస్తకళ వస్తువులు ఒకేచోట విక్రయించేలా షోరూంలను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి సవిత స్పష్టం చేశారు. చేనేత, జౌళి శాఖలో రెండేళ్ల ప్రగతిపై మీడియాతో సవిత మాట్లాడారు. ఈ సందర్భంగా కీలక ప్రకటన చేశారు. నేతనన్నకు భరోసా పథకం గురించి వివరాలు వెల్లడించారు. దీంతో త్వరల ోనే ప్రారంభించనుందని తెలుస్తోంది. నేతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# అటకెక్కిన ఎత్తిపోతల పథకాలు

- ఉమ్మడి కృష్ణా జిల్లాలో లక్షల ఎకరాలకు
- నీరు అందించాల్సిన పథకాలు నిర్వీర్యం

**టి మీడియా, జూన్ 22, కృష్ణా :**
ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఎత్తిపోతల పథకాల నిర్వహణ పూర్తిగా అటకెక్కింది. లక్షల ఎకరాలకు సాగునీరు అందించాల్సిన ఈ పథకాలను జలవనరులశాఖ గాలికి వదిలేసింది. గత ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన ఈ ఎత్తిపోతల పథకాలు మరమ్మతులకు నోచుకోకపోవడం రైతులను అవస్థలకు గురిచేస్తోంది. పూర్తిగా మెట్టప్రాంతమైన ఎన్టీఆర్ జిల్లాలో లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించే ఈ పథకాలను అటు కాలువల పనులతోనే సమాంతరంగా చేపట్టి మరమ్మతులు పూర్తిచేసి ఖరీఫ్ నాటికి అందుబాటులోకి తీసుకురావాల్సి ఉండగా ఆ దిశగా అటు అధికారులు, ఇటు ప్రభుత్వం ఆలోచించలేదు. ఇప్పటికప్పుడు పనులు ప్రారంభించినా ఈ ఖరీఫ్ లో సాగు పనులు ప్రారంభమయ్యే నాటికి నీళ్లు అందే పరిస్థితి కనిపించడంలేదు.

**ఎత్తిపోతల పథకాలు పూర్తిగా నిర్వీర్యం**
ఎత్తిపోతల పథకాల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం నెలకొంది. అడుగడుగునా ప్రభుత్వాల వైఫల్యాలను ఎత్తిచూపుతోంది. వైఎస్సార్?సీపీ నిర్లక్ష్యం చేసిన పథకాలను సంస్కరిస్తామని రెండేళ్ల క్రితం పాలకులు చెప్పినా పనులు మాత్రం ప్రతిపాదనలు దాటడంలేదు. దీంతో 1.30 లక్షల ఎకరాల్లోని వేలాది మంది రైతులు సాగునీరు లేక అవస్థలు పడుతున్నారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం, తిరువూరు, విజయవాడ గ్రామీణ



మండలాలకు సాగునీరు అందించే ఎత్తిపోతల పథకాలు పూర్తిగా నిర్వీర్యమయ్యాయి.నందిగామ, జగ్గయ్యపేట పరిధిలో 30వేల ఎకరాలకు పైగా నీరందించే వేదాద్రి కంచల ఎత్తిపోతల పథకం మూలకు చేరింది. ఇందులో నీటి సరఫరా చేసే నాలుగు మోటర్లు మూలకు చేరాయి. పైపు లైన్లు అనేక చోట్ల పగిలిపోయాయి. నందిగామ మండలం మాగల్లు, కొణతమాత్మకూరు పథకాలు ఎందకూ కొరగాకుండా పోయాయి. వీటి ద్వారా వెయ్యి ఎకరాలకు పైగా సాగు నీరు అందుతుంది. మాగల్లు పథకంలో మోటార్లు పూర్తిగా పాడయ్యాయి. కొణతమాత్మకూరులో కిలోమీటరు మేర పైపు గల్లంతైంది.

**మరమ్మతుల కోసం రూ.4.05 కోట్ల ప్రతిపాదనలు**
ఇబ్రహీంపట్నం, మైలవరం, జి.కొండూరు, విజయవాడ గ్రామీణలో 13.5 వేల ఎకరాలకు ఆధారమైన తారకరామ ఎత్తిపోతల పథకం నిర్వీర్యమైంది. మొత్తం 15 మోటార్లలో మూడు కూడా పని చేయటం లేదు. దీని మరమ్మతుల కోసం అధికారులు రూ.4.05 కోట్ల ప్రతిపాదనలు పెట్టినా ఇప్పటికీ నయా పైసా రాలేదు. చందర్లపాడు మండలంలోని పోపూరు, కాసరబాద, కుక్కునూరు, కొడవటికల్లు, పున్నవల్లి వెలదికొత్తపాలెం, చింతలపాడు-2, ఏటూరు, కంచికచర్లలోని మున్నలూరు, మొగులూరు పథకాలకు కృష్ణా నది ఉద్ధృతంగా ఉంటేనే నీరు అందుతుంది. నీటి పాయను ఈ పథకాల దిశగా మళ్లించాల్సి ఉన్నా పట్టించుకోవటం లేదు.

**మరమ్మతులకు రూ.61 కోట్లు అవసరం**
ఉమ్మడి కృష్ణా జిల్లాలో మొత్తం ఎత్తిపోతల పథకాలు 137 కాగా ఈ పథకాల ద్వారా మొత్తం లక్షా 30ఎకరాలకు పైగా ఆయకట్టు సాగవుతోంది. ప్రస్తుతం ఈ పథకాల్లో 92 పథకాలు పూర్తిగా దెబ్బతినగా వీటి మరమ్మతులకు రూ.61 కోట్లు అవసరంకానున్నాయి. ఎక్కువ పథకాల్లో మోటార్లు పాడవడం, పైపు లైన్లు పగిలిపోవటం, విద్యుత్తు పరికరాలు మాయం కావటంతో పని చేయటం లేదు. వెంటనే బాగు చేస్తే గాడినపడే అవకాశం ఉన్నా ఏళ్ల తరబడి మూలన పడడంతో ఇప్పుడు మరమ్మతులు చేసినా పని చేస్తాయో లేదో ప్రశ్నార్థకంగా మారింది.కూటమి అధికారం చేపట్టిన వెంటనే అధికారులు మరమ్మతులకు రూ.61కోట్ల ప్రతిపాదనలు పెట్టారు. ఎన్టీఆర్ జిల్లాలో కంచల వేదాద్రి ఎత్తిపోతల పథకానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని త్వరలోనే పనులు ప్రారంభిస్తామని నీటి సంఘాల నాయకులు చెబుతున్నారు. ఇప్పటికే నాలుగు సీజన్లు పూర్తికాగా మరో నెల రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుంది. మిగిలిన పథకాలకు సైతం ఇప్పుడు నిధులు వచ్చినా పనులు పూర్తై నీళ్లు అందించే అవకాశం కనిపించడం లేదు.

# ఫేక్ వీడియో - విజయవంతంగా నీట్ రీ ఎగ్జామ్

(మొదటిపేజీ తరువాయి...)
సమష్టిగా వ్యవహరించడం వల్ల ఈ ప్రవేశ పరీక్షను విజయవంతంగా నిర్వహించగలిగామని పేర్కొంది. ఈ పరీక్షలో 10వేల మందికి పైగా దివ్యాంగులైన అభ్యర్థుల కోసం విస్తృతమైన ఏర్పాట్లు చేశామని, అలాగే తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఉన్న సుమారు 81 మంది అభ్యర్థుల కోసం ప్రత్యేక నిబంధనలు అమలు చేసినట్లు తెలిపింది. ఈ మేరకు ఆదివారం పరీక్ష పూర్తి కాగానే ఎన్టీఏ ప్రకటన విడుదల చేసింది.

**ఎన్టీఏ డైరెక్టర్ ఏమన్నారంటే?**
నీట్ రీ-టెస్ట్ నిర్వహణపై ఎన్టీఏ డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్ స్పందించారు. నీట్ ప్రశ్నాపత్రం లీక్ అయినట్లు ఇప్పటివరకు తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదన్నారు. ఈ ఎగ్జామ్ పారదర్శకతను, విశ్వసనీయతను కాపాడేందుకు ఎన్టీఏ తీవ్రంగా కృషి చేస్తోందన్నారు. త్వరలోనే నీట్ ఎగ్జామ్ మూల్యాంకన ప్రక్రియ ప్రారంభమవుతుందని, ఫలితాలను వేగంగా విడుదల చేస్తామని స్పష్టం చేశారు. "కొన్ని చోట్ల తప్పుడు, నకిలీ అడ్మిట్ కార్డులతో ఎగ్జామ్ రాసేందుకు కొందరు వచ్చారు. అలాగే ఇతరుల స్థానంలో పరీక్ష రాసే ప్రయత్నాలను కూడా గుర్తించాం. మొబైల్ ఫోన్‌ను ఎగ్జామ్ సెంటర్‌లోకి తీసుకెళ్లడానికి ప్రయత్నించిన వారిపై చర్యలు తీసుకున్నాం. ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా నీట్ పరీక్ష నిర్వహించాం. " అని అభిషేక్ సింగ్ చెప్పారు.

## భోగాపురం హైవేపై ఘోర ప్రమాదం

- తాత, మనవడు దుర్మరణం



**టి మీడియా, జూన్ 22, విజయనగరం :**
విజయనగరం జిల్లా భోగాపురం జాతీయ రహదారిపై ఒక విషాదకర ఘటన చోటు చేసుకుంది. అతివేగం కారణంగా జరిగిన ఓ ఘోర రోడ్డు ప్రమాదంలో ఏడాదిన్నర వయసున్న చిన్నారితో పాటు అతని తాత ప్రాణాలు కోల్పోయారు. కారులో ప్రయాణిస్తున్న మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. శ్రీకాకుళం జిల్లా కంచిలి నుంచి రాజమండ్రి వెళ్తున్న కారు, అతివేగం కారణంగా అదుపుతప్పి డివైడర్ దాటి రాంగ్ రూట్‌లోకి దూసుకెళ్లింది. ఎదురుగా వస్తున్న లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జవగా, కారులో ఉన్న మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు.

**అతివేగమే ప్రమాదానికి కారణం**
పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాకుళం జిల్లా కంచిలి గ్రామం నుంచి ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు సభ్యులు కారులో రాజమండ్రి బయలుదేరారు. భోగాపురం సమీపంలోకి రాగానే కారు మితిమీరిన వేగం కారణంగా డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. దీంతో కారు డివైడర్‌ను దాటి అవతలి వైపు ఉన్న రాంగ్ రూట్‌లోకి దూసుకెళ్లింది. అదే సమయంలో ఎదురుగా వస్తున్న లారీని కారు బలంగా ఢీకొట్టింది.

**ఒడిలో కూర్చున్న చిన్నారి బలి**
ఈ ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. ప్రమాద సమయంలో ఏడాదిన్నర వయసున్న రాపాక సాత్విక్ అనే చిన్నారి ముందు సీట్లో ఉన్న వ్యక్తి ఒడిలో కూర్చొని ఉన్నాడు. లారీ బలంగా ఢీకొట్టడంతో సాత్విక్, అతని తాత మన్యాల సూరిబాబు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కారు ముందు భాగం నలిగిపోవడంతో డ్రైవర్ సీట్లోనే ఇరుక్కుపోయాడు. స్థానికులు, పోలీసులు ప్రత్యేక యంత్రాల సాయంతో కారు భాగాలను కట్ చేసి డ్రైవర్‌ను బయటకు తీశారు.

**నలుగురికి గాయాలు - ఆసుపత్రికి తరలింపు**
ఈ దుర్ఘటనలో మన్యాల లక్ష్మి, రాపాక కిశోర్, రాపాక ఉమామహేశ్వరి, కొయ్య నేహ అనే నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే భోగాపురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను, మృతదేహాలను వేర్వేరు వాహనాల్లో సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అతివేగమే ఈ ప్రాణాంతక ప్రమాదానికి కారణమని ప్రాథమిక విచారణలో తేలింది.

## జర్నలిస్టుల పిల్లలకు ఫీజుల్లో రాయితీ

**టీ మీడియా, జూన్ 22 పెబ్బేరు**



పెబ్బేరు స్పందించిన ప్రభుత్వము గత పదేళ్లుగా జర్నలిస్టుల పిల్లలకు విద్యాభారం తగ్గించేందుకు యూనియన్ కృషి చేస్తోందనీ టీయూడబ్ల్యూజే (ఐజేయు) వనపర్తి జిల్లా అధ్యక్షులు మాధవరావు స్పష్టం చేశారు జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజు రాయితీలు కల్పిస్తూ సోమవారం విద్యాశాఖ ప్రొసీడింగ్స్ జారీ చేసింది ఈ మేరకు సోమవారం జిల్లా విద్యాశాఖ ఏవో చేతుల మీదుగా ఉచిత విద్య ప్రొసీడింగ్స్ ప్రతులను టియుడబ్ల్యూజే (ఐజేయు) యూనియన్ జిల్లా అధ్యక్షులు డి మాధవరావు కు అందజేశారు 2026-28 విద్యా సంవత్సరానికి గాను జిల్లా కలెక్టర్ జారీ చేసిన అక్రిడిటేషన్ కార్డులు కలిగిన జర్నలిస్టుల పిల్లలకు ఒకరికి పూర్తిగా ఉచిత విద్య రెండో బిడ్డకు 50 శాతం ఫీజు రాయితీతో విద్య అందించాలని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు సూచించారు ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు మాధవరావు మాట్లాడుతూ గత పదేళ్లుగా జర్నలిస్టుల పిల్లలకు విద్యాభారం తగ్గించేందుకు యూనియన్ కృషి చేస్తోందన్నారు వారి ప్రతిపాదన మేరకు ప్రతి ఏడాది విద్యాశాఖ అధికారులు ఒక విద్యార్థికి పూర్తి ఫీజు మినహాయింపు మరో విద్యార్థికి 50 శాతం ఫీజు రాయితీ కల్పించేలా సర్క్యులర్ జారీ చేస్తున్నట్లు తెలిపారు సమాజానికి సమాచారాన్ని అందించడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ వారి కుటుంబాలు అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు జిల్లాలోని అన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు ఈ రాయితీలను అమలు చేసి జర్నలిస్టుల కుటుంబాలకు సహకరించాలని కోరారు ఈ నిర్ణయం జర్నలిస్టుల పిల్లల విద్యాభారాన్ని తగ్గించడంలో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ లు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వ్యాసరచన చిత్రలేఖన పోటీలు


**టీ మీడియా, జూన్ 22, వనపర్తి బ్యూరో :**




వనపర్తి పట్టణంలోని భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా అధ్యక్షురాలు శ్రీమతి కవిత యాదవ్ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ పరిపాలన బాధ్యతలు చేపట్టి 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన నాయకత్వం, పాలనా విధానం, దేశ అభివృద్ధికి చేసిన సేవలపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించే లక్ష్యంతో ఈ పోటీలను నిర్వహించారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని, విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీ కేతూరి బుడ్డన్న , జిల్లా ప్రధాన కార్యదర్శి వారణాసి కల్పన , జిల్లా కోశాధికారి శ్రీ కుమారస్వామి , జిల్లా కార్యదర్శి సరోజ, శ్రీ సరస్వతి శిశు మందిర్ ప్రధానాచార్యులు శ్రీ కిషోర్ పాల్గొన్నారు.కార్యక్రమం విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను పలువురు అభినందించారు.

## పరామర్శించినడాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి

**టీ మీడియా, జూన్ 22, వనపర్తి బ్యూరో :**



వనపర్తి మండలం చిన్న గుంట పల్లి తాండకు చెందిన బంజారా గిరిజన విద్యార్థి సమైక్య రాష్ట్ర అధ్యక్షులు శివ నాయక్ తండ్రి బద్రు నాయక్ అనారోగ్యంతో హైందవ హాస్పటల్ లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి హాస్పిటల్ కి వెళ్లి బద్రు నాయక్ ను పరామర్శించారు. డాక్టర్ తో బద్రు నాయక్ ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకుని బద్రు నాయక్ కి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. అనారోగ్యం నుంచి త్వరగా కోలుకుంటావని బద్రు నాయక్ కు ధైర్యం చెప్పారు. పరామర్శించిన వాళ్ళు ఎత్తం చరణ్ రాజ్, సీనియర్ నాయకులు నందిమల్ల రామ్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

# పాక్‌కు రహస్య సమాచారం చేరవేత

- ఐఎస్ఐ స్లీపర్ సెల్ సభ్యుడు అరెస్ట్
- బయటపడిన ఉగ్రకుట్ర



**టి మీడియా, జూన్ 22 , ఢిల్లీ బ్యూరో:**
ఛత్తీస్‌గఢ్‌లో ?పాకిస్థాన్ గూఢచారి సంస్థ ఐఎస్ఐకి చెందిన స్లీపర్ సెల్ సభ్యుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడిని పంజాబ్‌కు చెందిన సేవక్ సింగ్ (23)గా గుర్తించారు. సేవక్ సింగ్ మొబైల్ కాల్ రికార్డులను పోలీసులు పరిశీలించగా, అనుమానాస్పద నంబర్లతో వీడియో కాల్స్, వాట్సాప్ చాటింగ్ జరిపినట్లు తేలింది. దీంతో పాక్ ఐఎస్ఐతో సంబంధం ఉన్న ఈ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసి జ్యుడిషియల్ కస్టడీకి తరలించారు.

**పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం**
పంజాబ్‌లోని తర్న్ తారన్ జిల్లాకు చెందిన సేవక్ సింగ్ గత నాలుగు నెలలుగా అకల్తారా నగరంలోని మినీ మాతా చౌక్‌లోని రాజీవ్ కేడియాకు చెందిన ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. ఒక బంధువు ద్వారా జేఎస్‌డబ్ల్యూ పవర్ కంపెనీలో ఉద్యోగం పొందాడు. ఆ కంపెనీలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. జాంజ్‌గిర్ చంపాలో నేరాల పెరుగుదల, ఇతర రాష్ట్రాల నుంచి కార్మికుల రాక దృష్ట్యా అద్దెదారుల వివరాలను ధ్రువీకరించాలని ఎస్పీ విజయ్ కుమార్ పాండే స్థానిక పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు.

**పోలీసుల సోదాల్లో బయటపడ్డ నిజం**
ఈ క్రమంలో అకల్తారా పోలీసులు సేవక్ సింగ్ ఉంటున్న అద్దె ఇంటికి వెళ్లారు. అతడి వివరాలను కోరారు. అప్పుడు సేవక్ సింగ్ ప్రవర్తన అనుమానాస్పదంగా అనిపించడంతో పోలీసులు అతడి మొబైల్ ఫోన్‌ను పరిశీలించారు. ఆ మొబైల్‌తో నిందితుడు అనుమానాస్పద నంబర్లతో వీడియో కాల్స్, వాట్సాప్ చాటింగ్ జరిపినట్లు వెల్లడైంది. ఈ కాల్ రికార్డులు, వీడియో సంభాషణల ఆధారంగా సేవక్ సింగ్ ఐఎస్ఐ స్లీపర్ సెల్ సభ్యుడని పోలీసులు గుర్తించి, వెంటనే అతడి మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి జ్యుడిషియల్ కస్టడీకి తరలించారు. అలాగే ఈ అరెస్ట్ గురించి యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్)కు సమాచారం ఇచ్చారు.

**విచారణలో విస్తుపోయే నిజాలు**
సేవక్ సింగ్ మొబైల్ ఫోన్‌లో ఐఎస్ఐకి సంబంధించిన అనేక కీలక వివరాలు పోలీసులకు లభించాయి. దీంతో పోలీసులు అతడ్ని మరింతగా ప్రశ్నించారు. అప్పుడు పోలీసులతో కీలక విషయాలు పంచుకున్నాడు సేవక్ సింగ్. సోషల్ మీడియాలో ఐఎస్ఐ వీడియోలు చూసిన తర్వాత ఒక నంబర్‌కు తన వివరాలు పంపానని చెప్పాడు. ఆ తర్వాత తనకు రూ.20,000 అందిందని వెల్లడించాడు. డబ్బు పంపిన వ్యక్తి తనను ప్రస్తుత లొకేషన్, ఆ ప్రాంతానికి సంబంధించిన వీడియోను పంపమని కోరాడని స్పష్టం చేశాడు. అప్పుడు తాను బిలాస్‌పుర్ జిల్లాలోని ఎన్టీపీసీ ప్లాంట్, జేఎస్‌డబ్ల్యూ పవర్ కంపెనీకి సంబంధించిన లొకేషన్ వివరాలు, వీడియోలను పంపానని చెప్పాడు.

**స్లీపర్ సెల్ ద్వారా పెద్ద కుట్రకు ఐఎస్ఐ ప్లాన్**
నిందితుడు సున్నితమైన ప్రాంతాలు, వాహనాల కదలికలు, వీడియోలు, ఛత్తీస్‌గఢ్‌లోని ప్రముఖ వ్యక్తులకు సంబంధించిన వివరాలను అనుమానాస్పద నంబర్లకు పంపాడని జాంజ్‌గిర్ చంపా ఎస్పీ విజయ్ కుమార్ పాండే పేర్కొన్నారు. ఈ స్లీపర్ సెల్ ద్వారా ఒక పెద్ద కుట్రను అమలు చేయడానికి ఐఎస్ఐ ప్లాన్ చేస్తోందని తెలిపారు. ఈ కుట్రకు సంబంధించిన ఆధారాలు నిందితుడి మొబైల్ ఫోన్‌లోని చాట్‌లలో లభించాయని వెల్లడించారు. సేవక్ సింగ్ పంజాబ్‌కు వెళ్లినప్పుడు డ్రోన్ ద్వారా ఆయుధాలు, ఉగ్రవాద కార్యకలాపాలకు సంబంధించిన సామగ్రిని పాకిస్థాన్ నుంచి పంపేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారని తెలిపారు. వీటిని లక్షిత హత్యల కోసం ఉపయోగించాలని భావించారని అన్నారు. ఈ వ్యవహారంపై దర్యాప్తు చేయడానికి పోలీసులు ఫోరెన్సిక్ బృందం సహాయం కూడా తీసుకున్నారని వివరించారు.జాంజ్‌గిర్ చంపా వంటి ప్రశాంతమైన జిల్లాలో పాకిస్థానీ నిఘా సంస్థకు చెందిన స్లీపర్ సెల్ సభ్యుడు పట్టుబడటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. అయితే జాతీయ భద్రతకు సంబంధించిన కేసు కావడంతో పోలీసులు అత్యంత అప్రమత్తతతో దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడి అరెస్టుకు సంబంధించిన సమాచారం భద్రతా సంస్థల అధికారులకు పోలీసులు అందించనున్నారు.

## డీటీవోపైకి దూసుకొచ్చిన లారీ

- అక్కడికక్కడే మృతి చెందిన వెంకన్న



**టీ మీడియా, జూన్ 22, భూపాలపల్లి :**
జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. ఇటీవల నిజామాబాద్‌లో వాహనాల తనిఖీ సమయంలో ఆబ్కారీ కానిస్టేబుల్ సౌమ్యను గంజాయి స్మగ్లర్లు వాహనంతో ఢీకొట్టి చంపిన ఘటన మరువకముందే.. తాజాగా మరో విషాదం చోటుచేసుకుంది. భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూరు శివారులోని కార్యాలయ సమీపంలో వాహన తనిఖీలు చేపట్టారు.నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న ఓ హార్వెస్టర్‌ను సీజ్ చేసి రవాణాశాఖ కార్యాలయానికి తరలిస్తున్నారు. ఈ సమయంలో రహదారిపై వాహనాల రద్దీని నియంత్రించే క్రమంలో.. డీటీవో వెంకన్న భూపాలపల్లి నుంచి వస?తున్న బొగ్గు లారీని నియంత్రించేందుకు యత్నించగా.. అతివేగంగా వచ్చిన వాహనం వెంకన్నపైకి దూసుకొచ్చింది. నడుము పైనుంచి లారీ వెళ్లడంతో....విధినిర్వహణలో ఉన్న ఆ అధికారి.. అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. డీటీవో వెంకన్న మృతదేహాన్ని భూపాలపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. దర్యాప్తు చేస్తున్నారు. మహబూబాబాద్ జిల్లాకు చెందిన వెంకన్న ఈనెల 4నే జగిత్యాల నుంచి భూపాలపల్లికి బదిలీపై వచ్చారు.
అన్ని విధాలుగా ఆదుకుంటాం : భూపాలపల్లి డీటీవో వెంకన్న మృతిపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వెంకన్న కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామన్న సీఎం, ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్‌ను ఆదేశించారు.

**శవరాజకీయాలు చేయవద్దు**
భూపాలపల్లి రోడ్డు ప్రమాదంలో డీటీవో వెంకన్న మృతి పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతి పట్ల సంతాపం తెలిపారు. వెంకన్న కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై రవాణాశాఖ తనిఖీలు చేపట్టిందని తెలిపారు. డీటీవో మృతి ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి విచారణకు ఆదేశించారని, ఘటనాస్థలికి వెళ్లాలని కలెక్టర్, ఎస్పీని ఆదేశించామని పేర్కొన్నారు.ఇసుక అక్రమ రవాణాపై తమ దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ ఘటనపై శవరాజకీయాలు చేయవద్దని హితువు పలికారు.

**ప్రమాదం వెనక దాగిన నిజాన్ని వెలికితీయాలి :** భూపాలపల్లి జిల్లా రవాణా శాఖ అధికారి వెంకన్న ప్రమాదం వెనక దాగిన నిజాన్ని వెలికితీయాలని బీఆర్?ఎస్? ఎమ్మెల్యే హరీశ్?రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధికారులను బెదిరిస్తూ అక్రమ దందాలు సాగిస్తున్న ఇసుక మాఫియా, బొగ్గు మాఫియా వివరాలను బయటపెట్టాలని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. డీటీవో వెంకన్న మరణం వెనక ఉన్న వాస్తవాలను ప్రజల ముందుంచాలన్నారు. ఇసుక, బొగ్గు మాఫియాలకు అడ్డొస్తే లారీలతో తొక్కించి చంపిస్తారా అని ప్రశ్నించారు. ఇలాంటి దారుణాలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

**అధికారులకు తగిన భద్రత కల్పించాలి**
డీటీవో వెంకన్న మృతిపై నిష్పక్షపాత విచారణ జరపాలని, ప్రమాదానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ లచ్చిరెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యాప్తంగా ఇసుక అక్రమ రవాణా కట్టడికి చర్యలు చేపట్టాలని, తనిఖీలు నిర్వహించే అధికారులకు తగిన భద్రత కల్పించాలని కోరారు. డీటీవో వెంకన్న కుటుంబానికి తగిన పరిహారం ఇవ్వాలని, వెంకన్న కుటుంబసభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఉద్యోగుల జేఏసీ తరఫున వెంకన్న కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

## యాప్‌లో కనిపిస్తేనే యూరియా

(మొదటిపేజీ తరువాయి...)
ఇందల్‌వాయి మండలానికి చెందిన సాయన్నకు స్మార్ట్‌ఫోన్?లపై అవగాహన లేదు. దీంతో యూరియా స్టాక్ వచ్చిందనే విషయం తెలియగానే వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈవో) వద్దకో, మీ సేవకో వెళుతుంటారు. అయితే అప్పటికే 'నో స్టాక్' చూపడం జరుగుతోంది.

**వారికి ప్రత్యామ్నాయం చూపాలని డిమాండ్**
మొత్తం భూమి యాప్‌లో నమోదై, స్మార్ట్‌ఫోన్ వినియోగించి, యాప్? వినియోగంపై అవగాహన ఉన్న రైతులు స్టాక్ పెట్టినట్లు అధికారుల నుంచి సమాచారం అందగానే కావాల్సిన బస్తాలును బుక్ చేసుకుంటున్నారు. 48 గంటల్లో యూరియా అందుకుంటున్నారు. ఇతర మండలాలకు వెళితే రవాణా భారం పడుతుందని గుర్తించిన అధికారులు సొంత మండలానికే బుకింగ్ పరిమితం చేశారు. ఈ విధానాలు అమలు కాలవడంతో డీలర్లు ఎరువుల బస్తాలను పక్కదారి పట్టించే అవకాశాల్లేవు. అయితే యాప్?లోని సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు. సెల్?ఫోన్? వినియోగంపై అవగాహన లేని రైతులను ఉద్దేశించి, పట్టాలేని రైతులకు ప్రత్యామ్నాయంగా పంపిణీ ఎరువులను పంపిణీ చేయాలనే డిమాండ్ చేస్తున్నారు.

**పాత పాస్ పుస్తకాలుంటే సరి**
భూ సమస్యలున్న రైతులు ఏఈవోలను సంప్రదించవచ్చని ఇందల్‌వాయి ఏవో శ్రీకాంత్ తెలిపారు. పాత పాసు పుస్తకాలు ఉన్నవారు కూడా ఏఈవో వద్దకు వెళ్లి ఆయన ద్వారా యాప్?లో వివరాలు నమోదు చేయించుకోవచ్చని చెప్పారు. భూమి మొత్తం రికార్డులో లేని రైతులు, పంట నాటిన తర్వత ఏఈవో క్షేత్రస్థాయిలో పరిశీలిన చేస్తారని వెల్లడించారు. ఆ వివరాలు అప్?లోడ్? చేసే వెసులుబాటు ఉందని తెలిపారు.సాంకేతికతపై అవగాహన లేని రైతులు అధికారుల, మీసేవా కేంద్రాలకు వెళ్లి బుక్? చేసుకోవాల్సి వస్తున్నందున వీరి కోసం కొంత స్టాక్?ను ఏఈవోల పరిధిలో హోల్డ్? చేసి పెట్టాలని అభ్యుదయ కర్షకులు ఉన్నతాధికారులకు సూచిస్తున్నారు.




## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి :ఎస్ ఐ

**టీ మీడియా, జూన్ 22 ,పెబ్బేరు:**
వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్ జాతీయ డ్రగ్స్ దుర్వినియోగ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఈగల్ ఫోర్స్ తెలంగాణా ఆద్వర్యంలో అవగాహణ సదస్సు నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ద్వితీయ ఏస్ ఐ దివ్యా రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ యువత చదువు పై దృష్టి పెట్టాలని ఉన్నత స్థాయిలకు ఎదగాలని తల్లి తండ్రులను బాగా చూడాలని మీ మీద పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయొద్దని వారిని మద్యం మత్తు పదార్థాల వ్యాసనాలకు దూరంగా ఉండాలనీ ఆరోగ్యం దెబ్బతింటుందని రోగాలబారిన పడతారని చెడు సావాసాలు చేయొద్దని బాధ్యత గల పౌరుడిగా మెలగాలని అన్నారు.

## చింతకాని సభను చారిత్రాత్మకం చేయాలి

(మొదటిపేజీ తరువాయి...)
కాంగ్రెస్ శ్రేణులు పక్కాగా 'మైక్రో ప్లానింగ్' చేసుకోవాలని సూచించారు. ప్రతి బూత్‌లో వంద మంది జనాభాకు ఒకరిని ఇన్‌ఛార్జ్‌గా నియమించి, ఎంతమంది వస్తున్నారనే ఖచ్చితమైన జాబితాను పేరు, ఫోన్ నెంబర్‌తో సహా సిద్ధం చేయాలన్నారు. సభను పకడ్బందీగా నిర్వహించేందుకు ఆరు ప్రత్యేక కమిటీలను (మండల ఆర్గనైజింగ్, వాహనాల పర్యవేక్షణ, ప్రచార, మీడియా, మంచినీటి సదుపాయాలు, వాలంటీర్ల కమిటీలు) ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.ప్రస్తుత, మాజీ కాంగ్రెస్ మండల అధ్యక్షులు, డీసీసీ ప్రతినిధులు, మార్కెట్ కమిటీ నాయకులతో కూడిన 'మండల ఆర్గనైజింగ్ కమిటీలను' తక్షణమే ఏర్పాటు చేసుకొని, ప్రచార సామగ్రిని, వాహనాలను సమన్వయం చేసుకోవాలన్నారు.పోలీస్ వ్యవస్థపైనే పూర్తిగా భారం వేయకుండా, మన ముఖ్య నాయకులను గుర్తించి గౌరవంగా వేదికపైకి సాగనంపేందుకు కాంగ్రెస్ వాలంటీర్లే గేట్ల వద్ద బాధ్యత తీసుకోవాలని సూచించారు.రైతు సంక్షేమం పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతను, ప్రజా ఆదరణను ఈ సభ వేదికగా చాటి చెప్పాలని భట్టి విక్రమార్క ఆకాంక్షించారు. వైరా శాసనసభ్యులు మాలోతు రామదాసు నాయక్ మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రతిష్టాత్మకంగా చింతకానిలో నిర్వహిస్తున్న ఈ భారీ బహిరంగ సభను విజయవంతం చేయడానికి వైరా నియోజకవర్గం నుంచి 50 వేల మందిని తరలిస్తామని తెలిపారు. 30న నిర్వహించే
ఈ సభకు రైతు ఆశీర్వాద సభ అని పేరు పెట్టాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటివరకు జరిగిన బహిరంగ సభల రికార్డులను తిరగరాసే విధంగా చింతకాని సభ చారిత్రాత్మకంగా ఉండే విధంగా మనందరం కష్టపడి విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యం, పువ్వాళ దుర్గాప్రసాద్, నియోజకవర్గ పరిధిలోని మండల పార్టీ అధ్యక్షులు, ఏరియా బూత్ ఇన్చార్జీలు, ప్రజాప్రతినిధులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

**బహిరంగ సభ స్థలాల పరిశీలన**
ఈనెల 30 న ముఖ్యమంత్రి జిల్లా పర్యటన నిమిత్తం నిర్వహించే భారీ బహిరంగ సభ కోసం చింతకాని మండలంలో అనువైన ప్రాంతాలను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పరిశీలించారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్ లతో కలిసి పరిశీలించిన ప్రదేశాల్లో బహిరంగ సభ ఏర్పాట్ల గురించి చర్చించారు.